## క్లుప్తంగా

### సత్యసాయి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం



వైద్యం చేస్తున్న డాక్టర్లు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని గంగాపూర్ తండాలో సత్యసాయి శత జయంతి సందర్భంగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పున్నయ్య ఆధ్వర్యంలో పశువులకు వైద్యం చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైద్య సేవలపై ఆరా



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న అరమ్మాన్ బృందం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ స్థాయి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై మంగళవారం శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరమ్మాన్ బృందం సమీక్ష నిర్వహించింది. సీనియర్ రీసెర్చ్ అండ్ చీఫ్ ఇంపాక్ట్ ఆఫీసర్ డాక్టర్ అనుజా, అరమ్మాన్ బృందం డాక్టర్ మంజులా, దేవేందర్, రమణ పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా గర్భిణిలకు గ్రామ స్థాయిలో అందుతున్న వైద్య సేవలతో పాటు పలు అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయిసౌమ్య, పవన్, మౌనిక, హర్ష, శ్యామల, నిల్యా నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రేగోడ్ మీదుగా ఖేడ్‌కు బస్సు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలానికి సంగారెడ్డి ఆర్టీసీ బస్సు డిపో నుంచి మంగళవారం మరో బస్సు సర్వీసును ప్రారంభించారు. ప్రతి రోజు సంగారెడ్డిలో ఉదయం 10:30 గంటలకు బయలుదేరి రేగోడ్‌కు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుంది. రేగోడ్ నుంచి నారాయణఖేడ్ వెళ్లి తిరిగి రేగోడ్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు సంగారెడ్డికి వెళ్తుంది. నూతన బస్సుతో తమకు సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఫెరోజ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, నాయకులు నారాయణ, రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### పీవోఎస్ మిషన్ల ద్వారానే ఎరువుల అమ్మకాలు

వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ

రామాయంపేట(మెదక్): ఎరువుల దుకాణాల డీలర్లు పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ల ద్వారానే అమ్మకాలు కొనసాగించాలని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. రైతులు తమ ఆధార్‌కార్డు వివరాలను మిషన్లలో ఎంట్రీ చేయించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎరువులు కొనుగోలు చేసే క్రమంలో తమ వేలిముద్రను లేదా ఆధార్ వివరాలను డీలర్‌కు అందజేయాల్సి ఉంటుదని ఏడీఏ తెలిపారు. డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టం మేరకు వ్యవహరించకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### వన మహోత్సంలో విద్యార్థులు



వన మహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు

నర్సాపూర్: వన మహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక అడవిలో విత్తన బాల్స్‌ను విస్తరించారు. హైదరాబాద్‌కు చెందిన తపస్య డిగ్రీ కాలేజీ విద్యార్థులతో అటవీశాఖ రేంజ్ అధికారి అరవింద్, సెక్షన్ అధికారి సాయిరాం తదితరులు అటవీశాఖ నర్సాపూర్ బ్లాక్ పరిధిలోని అడవులలో వేప, చింత విత్తన బాల్స్ చల్లారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. ప్రకృతి పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



చేగుంట నాగులమ్మ ఆలయం వద్ద..



రేగోడ్: పూజలు చేస్తున్న మహిళలు

శ్రావణ మాసం నాగుల పంచమిని జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మంగళవారం తెల్లవారుజామునుంచే పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నాగదోషం తొలగిపోవాలని వేడుకున్నారు. అదే విధంగా శివాలయాల్లోను పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



కాడిపల్లిలో నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



నిజాంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



చిలప్‌చెడ్ లో శివలింగానికి, నాగప్రతిమలకు అభిషేకం చేస్తున్న మహిళలు



చిన్నశంకరంపేటలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

# గుర్తింపు కార్డుల గోస

**రైతు గుర్తింపు కార్డుల నమోదుకు నానాపాట్లు**

- ఓటీపీలు రాక ముందుకు సాగని ప్రక్రియ
- నిరీక్షించి.. నీరసించి ఇంటి ముఖం పడుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తింపు కార్డుల నమోదు కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుగుర్తింపు కార్డు పొందేందుకు వ్యవసాయ శాఖ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. దీంతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు శివ్వంపేట రైతు వేదిక వద్దకు వస్తున్నారు. అయితే.. రెండు రోజుల నుంచి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రైతుల ఫోన్ నంబర్‌కు ఓటీపీలు రావడం లేదు. దీంతో గంటల తరబడి నిరీక్షించి రైతులు వెనుతిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు అర్హులు అవుతారు. ఇప్పటి వరకు రైతు గుర్తింపు వివరాలు ఇవ్వని వారు 28, 29 తేదీలో మండల వ్యవసాయ కార్యాలయం వద్దకు రావాలని సంబంధిత రైతులకు వాట్సాప్ ద్వారా వ్యవసాయ సిబ్బంది సమాచారం ఇచ్చారు. నమోదు చేసుకునేందుకు రైతులు కార్యాలయానికి వచ్చినప్పటికి వాటి నమోదుకు రెండు రోజుల నుంచి ఇబ్బందులు తలెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నమోదు ప్రక్రియ కాకపోవడంతో నిరుత్సాహంతో రైతులు వెనుతిరిగి వెళ్లారు.

**నమోదు కాని సెకండ్ సీరియల్**





మండల కేంద్రమైన శివ్వంపేటలోని సెకండ్ సీరియల్ భూములు వివరాలు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్ సైట్‌లో రాకపోవడంతో వాటికి సంబంధించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరగడం లేదు. సుమారు 3 వేల ఎకరాల వరకు ఉన్న భూములకు సంబంధించి రైతులకు ధరణి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నప్పటికి నమోదు కావడం లేదు. టెక్నికల్ సమస్యతో ఇందుకు సంబంధించి భూముల వివరాలు లేకపోవడంతో రైతు రిజిస్ట్రేషన్ పక్రియ జరగడం లేదు. సీసీఎల్ఏలో భూముల వివరాలు నమోదు చేస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి శివ్వంపేటలోని సెకండ్ సీరియల్ భూముల టెక్నికల్ సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**ఎస్టీ గురుకుల ప్రిన్సిపాల్ ఫణికుమార్**

కొడిపల్లి(నర్సాపూర్): గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ తెలిపారు. మంగళవారం కొడిపల్లిలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలిపారు. గ్రంథాలయంలో నీట్, జేఈఈ, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలు, విజ్ఞానం, వినోదం, కథలు, పురాణాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గురుకులంలోని పుస్తకాలతోపాటు లైబ్రరీయన్ కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సొంత నిధులతో సైతం పుస్తకాలు, ర్యాక్స్ సమకూర్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ మంజుల, సునంద పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

### ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్‌గౌడ్ సస్పెండ్ అయ్యారు. జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడడంతో అధికారులు చర్యలు చేపట్టారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి పనుల్లో అవినీతికి పాల్పడినట్లు శివ్వంపేటలో జరిగిన సోషల్ ఆడిట్ ప్రజావేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేపట్టగా.. అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ అయింది.

### శిఖం భూమి స్వాధీనం

నర్సాపూర్: కుంట శిఖంను ఆక్రమణ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సాగునీటి పారుదల శాఖ ఏఈ మణిభూషణ్ తెలిపారు. నత్నాయిపల్లికి చెందిన సాయన్నకుంట శిఖం ఆక్రమణలకు గురైనట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం మండల సర్వేయర్ అభిలాష్‌తో కలిసి నత్నాయిపల్లికి చెందిన సాయన్నకుంట శిఖంను సర్వే చేశామన్నారు. కుంట 110 సర్వే నంబరులో రెండెకరాల మూడు గుంటల విస్తీర్ణం ఉంటుందని చెప్పారు. కుంట పక్కన భూమి కలిగిన వారి ఆధీనంలో సుమారు తొమ్మిది గుంటల శిఖం ఉన్నట్లు సర్వేలో తేలడంతో ఆక్రమణకు గురైన శిఖంను స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశామన్నారు.

## కేజీవీల్స్ ట్రాక్టర్లతో తంటాలు



వెంకటాపూర్‌లో రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళుతున్నాయి. దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రజల అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి వేసిన రోడ్లు కేజీవీల్స్‌తో తిప్పడం వల్ల అనతి కాలంలోనే పగుళ్లు వచ్చి గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో రోడ్డు రవాణాకు అంతరాయం కలగడంతో పాటు అందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కేజీవీల్స్ రోడ్లపై తిరుగకుండా చూడాల్సిన అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **ఓబీసీ మహాసభను జయప్రదం చేయండి**

రామాయంపేట(మెదక్): వచ్చే నెల 7వ తేదీన గోవాలో జరగనున్న ఓబీసీ మహా సభలను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారాం పిలుపునిచ్చారు. గోవాలోని శ్యాంముఖర్జీ ఇండోర్ స్టేడియంలో మహాసభ జరుగుతుందని తెలిపారు. సంఘం, దాని అనుబంధ సంఘాల ముఖ్య సభ్యులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూమ కిషన్, క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు గణేశ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్, పట్టణశాఖ అధ్యక్షుడు నరేశ్, మండల ఉపాధ్యక్షుడు దండు శివకుమార్, ధర్మారం గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ **సకాలంలో ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి : కాంగ్రెస్ నేత రాజిరెడ్డి**

నర్సాపూర్: ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కోరారు. మంగళవారం నమస్తే నర్సాపూర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మొదలుపెట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి మాట్లాడారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మల్లేష్, రాజుయాదవ్ ఉన్నారు.

◆ **పింఛన్ల అందజేత**

పెద్దశంకరంపేట(మెదక్): చేయూత లబ్ధిదారులకు మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ పింఛన్లు అందజేశారు. మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ముఖ గుర్తింపు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ సిబ్బందికి, గ్రామకార్యదర్శులకు పలు సూచనలు చేశారు.. ప్రజలు నూతన విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీపీఎం మానయ్య తదితరులు ఉన్నారు.

◆ **లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి**

రేగోడ్(మెదక్): తమను ఓబీసీలో చేర్చాలని వీరశైవ లింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు చిన్నవీరప్ప కోరారు. స్థానిక బసవేశ్వర విగ్రహం వద్ద మంగళవారం జెండా ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచారు. ఆయన మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి ప్రభుత్వాలు తమవంతు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూజారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

## కేజీబీవీలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

పాపన్నపేట(మెదక్): జీవన్ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పాపన్నపేట కేజీబీవీ విద్యార్థినిలకు ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్ ఆధార్ సొసైటీ డాక్టర్ నిహారిక, ఫౌండేషన్ నిరుపమ, సక్రుబాయి మాట్లాడుతూ..విద్యార్థినిలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నాలుగు నెలలకు సరిపడా ప్యాడ్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. పాపన్నపేట, కొల్చారం, టేక్మాల్, చిన్న శంకరంపేట, కేజీబీవీలలో కూడా ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## మరమ్మతుకు నోచుకోని సిగ్నల్స్

**వాహనదారుల అవస్థలు**



నర్సాపూర్ చౌరస్తాలో ఇష్టానుసారంగా వెళుతున్న వాహనదారులు

నర్సాపూర్: నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పని చేయడం లేదు. జాతీయ రహదారులపై నర్సాపూర్ నుంచి మెదక్, సంగారెడ్డి, తూప్రాన్ వైపు వెళ్లే కూడలి వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా అవి పని చేయడం లేదు. పోలీసు, మున్సిపాలిటీ శాఖల మధ్య సమన్వయం లేక సిగ్నల్స్ నిర్వహణకు నోచుకోవడం లేదు. సిగ్నల్స్‌ను మున్సిపాలిటీ అధికారులు నిర్వహించాలని, తాను గతంలో లేఖ సైతం ఇచ్చినట్లు ఎస్ఐ లింగం చెప్పారు. అలాగే.. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ట్రాఫిక్ పోలీసు విభాగం నిర్వహిస్తుందని మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇలా రెండు శాఖల అధికారులు తమకు సంబంధం లేదంటూ పరస్పరం తప్పించుకుంటున్నారు. కాగా, చౌరస్తాలో సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు తమ ఇష్టానుసారంగా వెళుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నాల్గు వైపుల నుంచి వచ్చే వాహనదారులు ఎవరికి వారు ముందుకు సాగడంతో చౌరస్తాలో అంతా గందరగోళంగా మారుతోంది. సిగ్నల్స్ పని చేయని సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ సైతం లేకపోవడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. వెంటనే సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

## హరిసింగ్ మార్గదర్శకుడు

**ఆయన సేవలు శ్లాఘనీయం: ఎంఈవో**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని చిలప్‌చెడ్ మండల విద్యాధికారి విఠల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిసింగ్ రాథోడ్ పదవీ విరమణ సందర్భంగా ఎంఈఓ, సహచర ఉపాధ్యాయులు హరిసింగ్‌ను ఘనంగా సన్మానించి, జ్ఞాపికాలు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ 36 ఏళ్లుగా హరిసింగ్ ఎంతో మంది విద్యార్థులకు మార్గదర్శకుడు అయ్యారన్నారు. హరిసింగ్ మాట్లాడుతూ తన ఉపాధ్యాయ జీవితంలో ఎంతో మంది సహచరులు, తనకు మద్దతు తెలిపారన్నారు. తన ప్రయాణంలోని జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉన్నతికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు.



హెచ్ఎం హరిసింగ్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న ఉపాధ్యాయులు

## యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

**పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్**

టేక్మాల్(మెదక్): రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలం అచ్చన్నపల్లిలో పెసర, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడరాదన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడిని రెట్టింపు పొందవచ్చని చెప్పారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలని సూచించారు. వాణిజ్య పంటలతో పాటూ చిరు ధాన్యాల పంటల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహా సూచనలు పాటించాలని కోరారు. ఇందులో వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



వరి పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ రాంప్రసాద్

## తీరిన తాగునీటి సమస్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామ శివారులో అన్ని రకాల హంగులతో పాఠశాల భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ, తాగు నీటి సమస్య కారణంగా భవనాన్ని ప్రారంభించలేదు. ఈ విషయమై 10వ తేదీన సాక్షిలో 'అలంకారప్రాయమేనా..?'అని శీర్షికపై ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు.. రూ.లక్షా 15 వేల నిధులు మంజూరు చేశారు. దాంతో గుత్తేదారు విఠల్ తాగు నీటి సమస్యను పరిష్కరించారు.

సాక్షి ఎఫెక్ట్



గౌతాపూర్ నూతన పాఠశాల భవనంలో తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## గుంతలు పూడ్చిన అధికారులు



నర్సాపూర్ చౌరస్తాలో గుంతలు పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నర్సాపూర్: నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పడిన గుంతలను జాతీయ రహదారుల శాఖ అధికారులు పూడ్చారు. సాక్షిలో ఈనెల 28న 'గుంతలను పట్టించుకోని అధికారులు శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వెంటనే గుంతలు పూడ్చి వాటిపై నుంచి వాహనాలు వెళ్లకుండా చెట్ల కొమ్మలు వేసి జాగ్రత్తలు తీసుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264